

శ్రీగిరిపై పౌర్ణమి వెలుగులు

కార్తీక మాసం సందర్భంగా జ్వాలా తోరణం

శ్రీశైలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీగిరి మహాక్షేత్రంలో కార్తీక పౌర్ణమి శోభాయమానంగా కాంతులీనింది. తెల్లవారుజాము నుంచి భక్తులు నదిలో పుణ్యస్నానాలు చేసుకుని ఆలయ ప్రధానవీధిలో దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్ల ఉభయ దేవాలయాల్లో అలంకార దర్శనం గంటసమయంలోనే చేసుకున్నారు. సుమారు 50 వేలకుపైగా భక్తులు క్షేత్ర సందర్శనం చేశారని ఆలయ అధికారులు వెల్లడించారు. అదే విధంగా జ్వాలా తోరణం సజావుగా సాగేందుకు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లను ఈవో శ్రీనివాసరావుతోపాటు ఎస్పీ సునీల్ షారాణ్ ఐపీఎస్‌లు పరిశీలించారు. ప్రధానంగా యాత్రికుల తిరుగు ప్రయాణాలు, ట్రాఫిక్ జాం వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలపట్ల సిబ్బందికి సూచనలిచ్చారు. అదే విధంగా మాసోత్సవాల్లో దేవస్థానం చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు.



మహానందిలో కార్తీక శోభ

మహానంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహానందిలో కార్తీక పౌర్ణమి శోభాయమానంగా నిర్వహించారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి వేకువజాముననే భక్తులకు దర్శనం ఏర్పాటు చేసారు. ప్రధాన ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని కోనేర్లల్లో భక్తులు కుటుంబ సమేతంగా కార్తీక పుణ్యస్నానాలను ఆచరించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. పరమ శివుడ్ని దర్శించుకొనేందుకు భక్తులు క్యూలో బారులు తీరారు.

మరిన్ని వార్తలు 6వ పేజీలో


కర్నూలు వినాయక ఘాట్ వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మహానందిలో జ్వాలా తోరణం


యాగంటి క్షేత్రంలో..


శ్రీశైలంలో పాతాళగంగలో దీపాలు వదలుతున్న భక్తులు

78 సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో వలస వెళ్తున్న తల్లిదండ్రుల పిల్లలు డ్రాపౌట్స్ కాకుండా 78 సీజనల్ వసతి గృహాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్ఎస్ఏ పీవో శ్యామూల్‌పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు, తుగ్గలి, పత్తికొండ, క్రిష్ణగిరి, ఆదోని, మంత్రాలయం, కోసిగి, హొళగుంద, హాలహర్వి, మద్దికెర మండలాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యం చేయండి

- పాడి పశువుల పెంపకంతో రైతులకు లాభం
- కలెక్టర్ సిరి


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కల్లూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు ఉన్నాయని, జిల్లాలో రైతులు ప్రకృతి సేద్యంతో పంటలు సాగు చేయాలని కలెక్టర్ ఏ.సిరి సూచించారు. బుధవారం కల్లూరు మండలంలోని పెద్దటేకూరు, తడకనపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'లో కలెక్టర్ పాల్గొని పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు ఖర్చులు తగ్గి, నేల సారం పెరుగుతుందని అన్నారు. మండల వ్యవసాయ అధికారుల వివరాల మేరకు కల్లూరు మండలంలో 16,934 మంది రైతులు 42,033 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నా రన్నారు.

తడకనపల్లెలో పశువుల హాస్టల్ పరిశీలించిన కలెక్టర్: తడకనపల్లె గ్రామంలోని పశువుల హాస్టల్‌ను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ 40 గేదెలున్నాయని రోజుకు 500 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటితో రోజుకు సుమారు 100 కిలోల పాల కోవా తయారు చేస్తున్నారని అధికారులు వివరించారు. పాడి పశువుల పెంపకం రైతులకు లాభదాయకమని కలెక్టర్ అన్నారు. వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహసీల్దారు కె. ఆంజనేయులు, సర్పంచ్ సహారాబి పాల్గొన్నారు.



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ

అందరికీ ఫోన్ల రికవరీ

- 669 ఫోన్లు అందజేశాం
- ఎస్పీ విక్రాంత్
- పోలీసులను అభినందనలు

కర్నూలు క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రతి ఒక్కరికీ వారి ఫోన్లు అందజేశామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో మూడవ మొబైల్ రికవరీ మేళాను నిర్వహిచారు. ఎస్పీ ఈ కార్యక్రమానికి హాజరై బాధితులకు ఫోన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రూ.1.20కోట్లు విలువచేసే 669 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. ఏపీ, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలోని పలు జిల్లాల నుంచి రికవరీ చేసేందుకు కృషిచేసిన ప్రతిఒక్క పోలీసులను అభినందించారు. ఈ ఏడాది మూడోసారి మొబైల్ రికవరీ మేళా చేపట్టామన్నారు. రికవరీలో కర్నూలు డీఎస్పీ కార్యాలయం అటాచ్‌మెంటులో పనిచేస్తున్న శేఖర్‌బాబు 96 మొబైల్స్, ఆదోని టూటౌన్ పీఎస్‌కు చెందిన నాగరాజు 30, ఇస్వి పీఎస్‌కు చెందిన రామచంద్ర 16 మొబైల్స్ రికవరీ చేయడంతో వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. మొబైల్స్ అందుకున్న బాధితులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, నాగరాజరావు, శివశంకర్, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, టెక్నికల్ టీం పోలీసులు పాల్గొన్నారు.


కబ్జాకు గురైన నిర్మల్ నగర్ పార్కు ఇదే

పక్కాగా కబ్జా..!

- నిర్మల్ నగర్ పార్కు స్థలం అన్యాక్రాంతం
- 45 ఏళ్ల క్రితం లే-అవుట్, కాలనీ ఏర్పాటు
- అర ఎకరం విస్తీర్ణంలో పార్కు.. కన్నేసిన ఆక్రమణదారులు
- వైసీపీ హయాంలో పట్టా పేరిట కబ్జాయత్నం
- అవి బోగస్ పట్టాలని తేల్చి చెప్పిన రెవెన్యూ అధికారులు

కర్నూలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలకు అంతు లేకుండా పోయింది. ఖాళీ స్థలమా.. కబ్జా చేసేయ్..! అన్నట్లు ప్రవర్తించారు. భూముల ధరలు చుక్కలు తాకడంతో భూబకాసురులు ప్రభుత్వ స్థలాలు, పార్కులను స్వాహా చేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్న కొందరు రెవెన్యూ అధికారులు, నగర పాలక అధికారుల సహకారంతో లే-అవుట్‌లో పార్కు స్థలాలు, ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన భూములను అన్యాక్రాంతం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఆక్రమణదారులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో పెట్రేగిపోతున్నారు. తాజాగా కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని నిర్మల్ నగర్, గురురాఘవేంద్రనగర్ కాలనీల మధ్యలో ఉన్న 'నిర్మల్ నగర్ పార్కు'లపై కొందరు కన్నేశారు. గతంలో కల్లూరు మండలంలో పని చేసిన తహసీల్దారు సహకారంతో బోగస్ పట్టాలు సృష్టించి కబ్జాకు స్కెచ్ వేశారు. ఆ స్థలం విలువ దాదాపు రూ.2 కోట్లకుపైగా ఉంటుందని అనధికారిక అంచనా. కబ్జా కోరల నుంచి పార్కును రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



కర్నూలు నగరం చౌరస్తా సమీపంలో నిర్మల్ నగర్, గురురాఘవేంద్ర నగర్, గీతా నగర్ వెలిశాయి. 1981లో కల్లూరు గ్రామ పంచాయతీగా ఉంది. ఆ సమయంలో సర్వే నంబర్లు301/బి, 302, 302/2, 304/1, 305/2, 284/పీ, 286/1, 287/1 అండ్ 3 పరిధిలో 19.66 ఎకరాల విస్తీర్ణంలో లే-అవుట్ ప్లాన్ (ఎల్‌పీ) నంబరు - 121/1981 కింద గురురాఘవేంద్ర నగర్ వెలసింది. ఒక్క ప్లాట్ 5.50 సెంట్లు ప్రకారం 187 మందికి విక్రయాలు చేసి రిజిస్ట్రేషన్ చేయించారని స్థానికులు చెబుతున్నారు. ఎల్‌పీ నంబరు-121/1981లో ప్రజా, ప్రభుత్వ అవసరాల కోసం 1.01 ఎకరాలు ఖాళీ స్థలం (ఓపన్ సైట్) వదిలారు. గురురామవేంద్ర కాలనీ పక్కనే నిర్మల్ నగర్, గీతా నగర్ కూడా వెలిశాయి. కల్లూరు పంచాయతీ కర్నూలు నగరపాలక సంస్థలో విలీనం కావడంతో పార్కుల సంరక్షణ బాధ్యత నగరపాలక సంస్థ అధికారులే చూడాల్సి ఉంది.

మిగతా 8వ పేజీలో

పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి


వరి పంటను పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి

పెద్దకడబూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి సూచించారు. మండలంలోని మేక డోణ, చిన్నతుంబళం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. రైతులకు వరి పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద, చిన్న పురుగులు వరి మొక్క రసాన్ని పీలుస్తాయని, దీని వల్ల ఆకులు ఎండిపోయి, సుడి తెగులు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏవో సుచరిత, సిబ్బంది వీఎఎ. హరి తేజ, రామేశ్వరి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫరీద్ అహ్మద్‌ను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ సస్పెండ్ చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఒకే ఫోన్ నెంబర్‌ను 928 అసెస్మెంట్‌లకు నమోదు చేశారు. ఈకారణంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు.

టికెట్లు అమ్ముకునే సంస్కృతి లేదు

- టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం
- మంత్రి టీజీ భరత్



కర్నూలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీలో ప్రజామోదం కలిగిన నాయకులకే టికె ట్లు ఇస్తారని, టికెట్లను అమ్ముకొనే సంస్కృతి లేద ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మరో ఏడాది వరకు నగరపాలక సంస్థ ఎన్నికల్లేనందున అభ్యర్థుల ఎంపిక సమస్యే లేదని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని ఎదుర్కొనే ధైర్యం లేక టీడీపీ కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకు రాజకీయ కుట్రలో భాగంగానే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. టీడీపీకి, టీజీ కుటుంబానికి డబ్బులకు టికెట్లు అమ్ముకునే సంస్కృతి లేదని అన్నారు.

శ్రీగిరిపై పౌర్ణమి వెలుగులు


ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవ వేడుక


కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కోటి దీపోత్సవం

మహానంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి మహానందిలో వైభవంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాల్లో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఆలయం మహాముఖ ద్వారం ముందు ఏర్పాటు చేసిన జ్వాలా తోరణానికి పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు పాల్గొనగా కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు.



యాగంటిలో పూజలు

బనగానపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎర్రమల కొండల్లో వెలసిన అత్యంత పురాతనమైన శైవక్షేత్రం యాగంటిలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష దీపోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు, మహిళలు ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

లక్ష దీపోత్సవ కాంతులు

శ్రీశైలం నవంబర్ 05 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో పరమశివునికి ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం వేళ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్సవంగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వేదికపై ఆసీనుల చేసి షోడశోపచార పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లతోపాటు పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగువైపులా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి


కాల్వబుగ్గలో జి.కబర్ధికి స్వాగతం పలుకుతున్న కమిటీ మెంబర్లు

ఓర్వకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కాల్వబుగ్గ, కొమ్ముచెరువు, కాల్వ, ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి పూడిచెర్ల, నన్నూరు. ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, కన్నమడకల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో దీపాలు వెలిగించి మహిళలు తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయానికి ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివునికి అభిషేకం చేసి ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీకదీపాలు వెలిగించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం గౌరవ సలహాదారాలు విజయభారతికి ఆలయ ఈవో మద్దిలేటి, ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ తదితరులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు.

వైభవంగా తుంగా హారతి

- నదీతీరాన లక్ష దీపోత్సవం
- శ్రీమఠంలో ఘనంగా జ్వాలా తోరణం

మంత్రాలయం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య తుంగా హారతి రమణీయంగా సాగింది. బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తుంగభద్ర నది ఒడ్డున వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ప్రహ్లాదరాయలకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. పీఠాధిపతి తుంగభద్రమ్మకు చీర, పసుపు, కుంకుమ ఇచ్చి పూజలు చేసి హారతులు ఇచ్చి కార్తీకదీపాలను వెలిగించారు. నది ఒడ్డున భక్తులు, దాససాహిత్య భజన మండలి సభ్యులు లక్ష దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రతీర్థఆచార్, ఆనందతీర్థ ఆచార్, మఠం ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు. మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్‌లతో సీఐలు మంజునాథ్, అబ్దుల్‌గౌస్ బందోబస్తు నిర్వహించారు.


తుంగా హారతి ఇస్తున్న పండితులు


తుంగభద్ర నదికి కార్తీక పూజలు చేస్తున్న పీఠాధిపతి


దేదీప్యమానంగా కార్తీక పౌర్ణమి


కర్నూలులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు










హారతులు ఇస్తున్న వేద పండితులు



కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం నింగిలోని తారలన్నీ నేలపై వెలిగినట్లుగా.. దీపోత్సవ శోభ నేల నాలుగు చెరగులా పసిడి కాంతులు నింపింది. శ్రీశైలం, అహోబిలం, మహానంది, యాగంటి, మంత్రాలయం తదితర దివ్య క్షేత్రాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు, జ్వాలా తోరణాలు, ఆకాశ దీపాలు వెలిగించి సంతోషంగా వేడుకల్లో పాల్గొన్నారు. కర్నూలు నగరంలోని వివిధ ఆలయాలు, ధార్మిక క్షేత్రాలు, కేసీ కెనాల్ ఒడ్డున శుక్రవారం సాయంత్రం నుంచి నిర్వహించిన కార్తీక దీపోత్సవం కన్నుల పండువ చేసింది. శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక దీపాలు, జ్వాలా తోరణాల మహోత్సవాలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని చెరువులు, నదుల్లో మహిళలు దీపాలు వదిలారు. కర్నూలులోని కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వందలాదిగా మహిళలు తరలి వచ్చి, సామూహికంగా దీపాలను కేసీ కెనాల్‌లో వదలి పూజలు నిర్వహించుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కర్నూలు కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం


సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నగరంలోని సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ పాల్గొన్నారు.

మంత్రాలయంలో..

మంత్రాలయం: మంత్రాలయం రాఘ వేంద్ర స్వామి మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం మఠం పీఠాధి పతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధ వారం కార్తీక పౌర్ణమి సందర్భంగా యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం దృష్టికి కళాకారుల సమస్యలు

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి
- కర్నూలు ఉత్సవ్-2025 సభలో హామీ

కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నిరుపేద కళాకారుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోయి, పరిష్కారానికి కృషి చేస్తానని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, ఏపీ నాటక అకాడమీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న కర్నూలు ఉత్సవ్-2025 ఐదో రోజు బుధవారం కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉమ్మడి జిల్లా రాజకీయ నేతల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆమె పరిశీలించారు. సభలో తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. బుధవారం ఏకాంకిక నాటక పోటీలకు హాజరైన 16 మంది రంగస్థల కళాకారులను, ఐదుగురు హార్మోనిస్టు గురువులను ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా సాహిత్య, సాంస్కృతిక, కళారూపాలను వారం రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి ముఖ్యమంత్రి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, కళాకారులకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు ఉత్సవ్-2025 స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం సభ్యులు వెంకటేశ్వరావు, యాగంటీశ్వరప్ప, కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ రాయబారం నాటకంలో ఒక సన్నివేశం


ఎంపీ బైరెడ్డి శబరితో సత్కారం పొందిన కళాకారులు

కళాకారులను ఆదరించాలి

- అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి


కళాకారులను సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళాకారులను ఆదరించాలని అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. యాగంటి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన పంచర త్నాల నాటక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కర్నూలు టీజీ వీ కళాక్షేత్రం, బనగానపల్లె అరుణభారతి సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పంచరత్నాల నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి సహకారంతో ఏర్పా టు చేసిన నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించాయి. బీసీ రాజారెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డిలు సంయుక్తంగా నాటకంలో ప్రదర్శించిన కళాకా రులను ఘనంగా సత్కరించారు. రాత్రి 8 గంటల నుంచి నాటక ప్రదర్శనలు ప్రారంభ మయ్యాయి. ప్రముఖ కళాకారు లచే గయోపాఖ్యానం పడక సీను, శ్రీకృష్ణ తులాభారం, అలకసీను, గయో పాఖ్యానం యుద్ధసీను, సత్యహరిశ్చంద్ర భవానీ సీను, కాటి సీను నాటక ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. కళాకారులు శ్రీనివాసరెడ్డి, రమణ, చల్లా నవీన్‌కుమార్ చౌదరి, డాక్టర్ కదిరి రమేశ్, శ్రీమతి సుశీల, ఎం.వీ బాషా, హనుమంతుయాదవ్, గజల్ కళాకారుడు మహ్మద్‌మియాలు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ కళలకు కణచి అని, టీజీవీ కళక్షేత్రం కళాకారులకు అనేక నంది అవార్డులు వచ్చాయన్నారు. కళలను, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని నాటకా లను తిలకించారు.

చెలమ వద్ద బీసీ రాజారెడ్డి పూజలు: యాగంటి సమీపంలోని మారుసీళ్ల చెలిమ వద్ద అమ్మవారికి, శివునికి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పూజలు చేశారు. ఈసందర్భంగా చెలిమ ప్రాముఖ్యతను ఆలయ నిర్వాహకులు ఆయనకు వివరించారు. అనంతరం బీసీ రాజారెడ్డి యాగంటి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గౌరవ వేతనాలు విడుదల చేయాలి


మంత్రి నారా లోకేష్‌తో పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్పంచులు, ఎంపిటీసీల, జడ్పీటీసీల గౌరవ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రుప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల సమస్యలు, నిధులు, విధులు, అధికారాల అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని వీరికి మంత్రి హామీ ఇచ్చారు. కొత్తపు మునిరెడ్డి, గోగినేని వసుద, చుక్క ధనుంజయ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి యలవర్తి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వినోద వేదికగా వన భోజనాలు


షటిల్ ఆడుతున్న కలెక్టర్ సిరి


క్యారం బోర్డు ఆడుతున్న అధికారులు

- కలెక్టర్ సిరి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక వన భోజనాలు వినోద వేదికగా అన్ని వర్గాల ప్రజలను ఆహ్లాదపరుస్తాయని కలెక్టర్ ఏ. సిరి అన్నారు. బుధవారం నగర శివారులోని విజయవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో వన భోజనాలు అందరికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే వేదికగా అగుపిస్తున్నాయని అన్నారు.

అలరించిన ఆట పాటలు

కార్తీక వన సమారాధన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో అతిథులు భాగస్వాములయ్యారు. కలెక్టర్ సిరి షటిల్, మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్‌లో పాల్గొన్నారు. సంయుక్త కలెక్టర్ నూరల్ ఖమార్ షటిల్, కార్యమ్స్‌లో పోటీపడ్డారు. అనంతరం జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అవినాష్ జయసింహ సినీ గీతాలను ఆలపించారు. ఆటల పోటీల్లో మహిళా ఉద్యోగులు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముగింపుగా అటవీశాఖ ఆధ్వర్యంలో అతిథులకు తులసి మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు కృష్ణమూర్తి, డీఎఫ్‌వో శ్యామల, డీఆర్వో వెంకట నారాయణమ్మ, గృహనిర్మాణశాఖ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్

వృద్ధుడి బలవన్మరణం

క్రిష్ణగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనను చూసుకునేందుకు ఎవరూ లేరు అన్న దిగాలుతో ఓ వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని తొగర్చేడు గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ బజారి(66)కి ముగ్గురు కొడుకులు. వీరంతా ఓ హత్యకేసులో నిందితులు. కాగా రెండో కుమారు బోయ రామాంజినేయులు ఆరేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. మొదటి, మూడో కుమారుడు బాలకేశన్న, రామానాయుడు కడప సెంట్రల్ జైల్‌లో జీవిత ఖైదీ శిక్షను అనుభవిస్తున్నారు. బజారిని చూసుకోవడానికి కొడుకులు ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

క్రిష్ణగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న రైతు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ఎరుకలచెరువుకి చెందిన రైతు కురువ వెంకట్రాముడు (46) అప్పుల బాధ తాళలేక సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు క్రిష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొంది ఇంటికెళ్లాడు. కాగా క్షీణించడంతో కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి కుమారుడు వీరాంజనేయులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీజీహెచ్‌లో దొంగల హల్‌చల్

- గైనిక్ విభాగంలో వైద్యుల సొమ్ము చోరీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో దొంగలు హల్‌చల్ చేశారు. పభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వైద్యులకు భద్రత కరువైంది. ఆసుపత్రిలో ప్రతి రోజు దొంగతనాలు సర్వసాధారణంగా మారాయి. మంగళవారం గైనిక్ విభాగంలోని డీఆర్ రూంలో కాన్పు కోసం వెళ్లిన ఓ వైద్యురాలి బ్యాగ్‌లో నుంచి రూ.1,500 దొంగలు ఎత్తుకెళ్లడం కలకలం రేపింది. మూడు రోజుల క్రితం ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు చెందిన రూ.2,500, నాలుగు రోజుల క్రితం ఓ డాక్టర్ అవసరాల కోసం బ్యాగ్‌లో పెట్టుకున్న రూ.5వేలు చోరీకి గురయ్యాయి. ఇలా డాక్టర్ల సొమ్ము చోరీకి గురి కావడంతో వైద్యులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గైనిక్, చిన్న పిల్లల విభాగంలో పర్యవేక్షణ లేకపోవడం, రోగులు, వారి బంధువుల నుంచి సెల్‌ఫోన్లు, ఖర్చుల కోసం తెచ్చుకున్న డబ్బులను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. ఆసుపత్రిలో కొత్తగా రోగుల భద్రత కోసం ఈగల్ హంటల్ ఏజెన్సీకి ప్రభుత్వం కేటాయించి ఆసుపత్రిలో 238 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం 148మంది మాత్రమే పని చేస్తుండటంతో సిబ్బంది లేక దొంగతనాలు తరుచూ జరుగుతున్నాయి. మూడు నెలలుగా సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని హాస్పిటల్ అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఏజెన్సీ వాటిని పక్కన పెడుతున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా స్పందించి సెక్యూరిటీ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి రోగులకు, వైద్యులకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గడివేముల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిమద్దెలలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, వీఆర్వో ఫనీద్ర దాడులు నిర్వహించి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ప్రసాద్‌రావు మరో ఇంటిని బాడుగకు తీసుకొని అక్రమంగా 30 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేసి రేషన్ బియ్యం పట్టుకొని అతడిపై కేసు నమోదు చేశామన్నారు.



రేషన్ బియ్యంతో రెవెన్యూ సిబ్బంది

మహానందిలో ప్రముఖుల పూజలు



మహానందిలో పూజలు నిర్వహించడానికి వస్తున్న ప్రభుత్వ సలహాదారు అజయ్‌కుమార్ జైన్

మహానంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహానందిలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి, ప్రభుత్వ సలహాదారుడు అజయ్‌కుమార్ జైన్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. నంద్యాల ఏఎస్పీ మందాజావళి తో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఏఎస్పీ ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని ఆదేశించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- చికిత్స కోసం కర్నూలుకు తరలింపు

జూపాడుబంగ్లా/నందికొట్కూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి ఓ హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన జూపాడుబంగ్లా మండల కేంద్రంలో ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, తోటి విద్యార్థినులు తెలిపిన మేరకు వివరాలు.. మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ (కామర్స్) చదువుతోంది ఓ విద్యార్థిని. మంగళవారం సాయంత్రం కళాశాల ముగిసిన అనంతరం ఆ విద్యార్థిని హాస్టల్‌కు రాలేదు. తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుకలను జరుపుకునేందుకు మరో స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. హాస్టల్ వార్డెన్ కళ్యాణి సాయంత్రం 6గంటల సమయంలో స్టడీ అవర్స్‌లో అటెండెన్స్ తీసుకుంటుండగా విద్యార్థిని గైర్హాజరు కావడంతో ఆమె అమ్మాయి ఇంటికి ఫోన్‌చేసి సమాచారమిచ్చింది. స్టడీ హాల్‌లో ఉన్న ఇతర విద్యార్థినులను ప్రశ్నించగా డేస్కాలర్ విద్యార్థిని జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిందని వారు తెలిపారు. సదురు విద్యార్థినికి ఫోన్‌చేసి హాస్టల్‌కు రాకుండా అనుమతి లేకుండా ఎలా వెళ్తావు అంటూ వార్డెన్ మందలించింది. హాస్టల్‌లో జరిగిన సంఘటనను ప్రిన్సిపాల్ రమేష్ దృష్టికి ఆమె తీసుకెళ్లింది. బుధవారం ఉదయం విద్యార్థిని తోటి విద్యార్థినులతో కలిసి స్కూల్‌కు వచ్చింది. అనుమతులు లేకుండా బయటికి ఎలా వెళ్తావు.. టీసీ తీసుకొని వెళ్లిపోమని ప్రిన్సిపాల్ సైతం మందలించారు. అంతలోనే విద్యార్థిని తల్లి కూడా వచ్చి కూతురిపై ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో భయపడ్డ ఆవిద్యార్థిని ఏమి చేయాలో తెలియక వాష్‌రూంకు వెళ్లి ఎలుకల మందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లింది. ఇది గమనించిన విద్యార్థినులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జూపాడుబంగ్లాలో పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి నందికొట్కూరు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. విద్యార్థిని కాలేజీకి వచ్చే ముందే కిరాణ దుకాణంలో ఎలుకల మందు కొనుగోలు చేసింది తోటి విద్యార్థినులు చెబుతున్నారు. అసలు ఈ ఘటనలో అందరి నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థిని అనుమతి లేకుండా బయటికెళ్లి రాత్రికి కూడా రాకపోవడం. కనీసం వార్డెన్ అయినా స్పందించి ఆ అమ్మాయిని తీసుకురాకపోవడం.. ప్రిన్సిపాల్, వార్డెన్, తల్లి అందరూ కలిసి మందలించడంతో విద్యార్థిని భయపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది.

తోడేస్తున్నారు..

తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటం ఇసుకాసురులకు కలిసి వచ్చింది. నీరు ఉండటంతో ప్రభుత్వం ఇసుక తరలింపును నిలిపేసింది. ఇదే వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. నీటి ప్రవాహం తక్కువగా ఉన్న ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. అధికారులకు ఇంతో అంతో ఆమ్యామ్యాలు ఇచ్చి సర్దుబాటు చేసుకున్నారు. దీంతో సంబంధిత శాఖల అధికారులు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు.

- తుంగభద్ర నదిలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- అనుమతుల్లేకుండా దోచేస్తున్న అక్రమార్కులు
- కన్నెత్తి చూడని మైనింగ్, రెవెన్యూ అధికారులు
- పని చేయని సీసీ కెమెరాలు



తుంగభద్రనదిలో అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్లు

కౌతాళం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో ఇసుకను అక్రమార్కులు తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు ఇసుకాసురులు. మండలంలో నదిచాగి, గుడికంబాలి, మరళి గ్రామాల్లోని ఇసుక రీచ్‌లకు ప్రభుత్వ అనుమతులున్నా ప్రస్తుతం నదిలో నీరు ఉండటంతో ఇసుక రీచ్‌ల నుంచి తాత్కాలికంగా ఇసుక తరలింపును నిలిపి వేశారు.

కనిపించని సీసీ కెమెరాలు



రోడ్లు గుంతలమయంగా మారి..

ట్రాక్టర్ల ద్వారా ఇసుకను నిత్యం తరలిస్తుండటంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సి మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు మాముళ్ల మత్తులో ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టినా అది నిజమైన లబ్దిదారులకు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నీరు తక్కువ ఉన్న ప్రదేశంలో..

నదిచాగి రీచ్ వద్ద నదిలో నీరు తక్కువ ఉన్న ప్రదేశంలోకి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్‌ల ద్వార ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌కు రూ.800నుంచి రూ.1000 ప్రకారం వసూలు చేస్తూ అక్రమాలకు తెరలేపారు. ఇక్కడ నుంచి మండలంలోని ఇతర గ్రామాలతో పాటు కోసిగి, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలకు ట్రాక్టర్ల ద్వార రవాణా చేస్తున్నారు. నదిచాగి వద్ద ఉన్న తుంగభద్ర నది నుంచి కాత్రికి, పొదలకుంట, సుళేకేరి మీదుగా కౌతాళం ఆదోని మండలాలకు, నదిచాగి హల్వి మీదుగా కోసిగి, ఎమ్మిగనూరుకు నిత్యం వందల సంఖ్యలో ఇసుకను తరలిస్తున్నారు.

దూరం పెరిగే కొద్ది..

ట్రాక్టర్ ఇసుక కావాలంటే 20-30కిలోమీటర్ల దూరానికి రూ.3వేల నుంచి రూ.5వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. దూరం పెరిగేకొద్ది ఇసుక మరో రేటు ఉంటుంది. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు నదీతీర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేసులు నమోదు చేస్తాం

ఇసుక తరలింపుపై తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం నదిలో నీరు ఉండటంతో ఇసుక తరలింపును నిలిపివేశామన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా నది నుంచి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవ కేసులు పెంచండి



మెడికల్ కాలేజీలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

- బోధనాసుపత్రి సమస్యలను పరిష్కరిస్తాం : కలెక్టర్
- కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యులతో సమీక్ష

కర్నూలు హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ కింద కేసులన్నింటిని ప్రీ అథరైజ్ చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో జీజీహెచ్, మెడికల్ కాలేజీ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ కింద 250 మంది రోగులుంటే 150 మంది రోగుల వివరాలు మాత్రమే డాక్యుమెంటేష్ చేస్తున్నారపి, 75 మంది సిబ్బందితో కేసుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. ఇందుకు స్పందించిన హాస్పిటల్ సూపరింటెండెంట్ తెలంగాణ కేసులు ఉంటాయనీ, అవి పరిగణలోకి రావని వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక ఆపరేషన్లు నిర్వహిస్తున్న జనరల్ సర్జరీ విభాగాన్ని కలెక్టర్ అభినందించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద అవసరమైతే బయట నుంచి మత్తుమందు వైద్యులను రప్పించుకునే అవకాశాన్ని కలెక్టర్ కల్పించారు. అత్యవసర సర్జరీ కేసులకు రేడియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ రాత్రి సమయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కొందరు వైద్యులు కలెక్టర్‌కు విన్నవించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ 24 గంటలు ఒక రేడియాలజిస్టు డ్యూటీలో ఉండాలని ఆదేశించారు. అనస్థీషియా విభాగాన్ని ఇతర విభాగాల మాదిరిగా ఆరు యూనిట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కాన్సర్ ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్లను ఇంకా పూర్తి చేయకపోవడంపై కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, డా.హరి చరణ్ హెచ్‌వోడీలు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు

మొక్కజొన్న ధర పతనం



యార్డులో రైతులు అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న

- కన్నీరు మున్నీరవుతున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటానికి రూ.2,400 కాగా, బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటా మొక్కజొన్నల ధర గరిష్ఠంగా రూ.1,749లు, మధ్యస్థ ధర రూ.1709లు, కనిష్ఠంగా రూ.1,409ధర మాత్రమే పలకడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. రెండు నెలల నుంచి తాము ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నా మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాల కోసం చర్యలు తీసుకోకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికందిన పంటనైనా దక్కించుకుందామని రైతులు ఆశిస్తే కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటానికి రూ.700 వ్యత్యాసంతో ధర పతనం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోటారు వాహనాల దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హత కలిగిన దివ్యాంగులు, మూడు చక్రాల మోటార్ వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ మేనేజర్ రయిస్ ఫాతిమా తెలిపారు. వివరాల కోసం 08518-277864ను సంప్రదించాలన్నారు.

అర్హత ప్రమాణాలు

- 25-11-2025 నాటికి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు
- ఒకటి లేదా రెండు కింద భాగాలు (లోయర్ లింబ్స్) ప్రభావితమై 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండాలి
- వార్షిక కుటుంబ ఆదాయం రూ.3లక్షల కంటే ఎక్కువ ఉండకూడదు
- అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి
- వాహనం నడపడానికి చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి
- ప్రభుత్వం లేదా ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు ముందు ఏ వాహనాన్ని పొంది ఉండకూడదు

దరఖాస్తుతోపాటు జత చేయాల్సిన ధృవీకరణ పత్రాలు

- వికలాంగుల ధృవపత్రం (సదరం/ జిల్లా వైద్య బోర్డు), ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, కుల ధృవపత్రం, తాజా ఆదాయ ధృవపత్రం, పాస్ ఫోర్ట్ సైజు ఫొటో, ఇంతకు ముందు వాహనం పొందలేదని స్వీయ ప్రకటన.

రెవెన్యూ డివిజన్‌గా బనగానపల్లె

- ప్రభుత్వానికి ప్రతిపాదన

నంద్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల పునర్విభజన నేపథ్యంలో బుధవారం అమరావతిలో జరిగిన సదరు కమిటీ మంత్రుల సమావేశంలో జిల్లాలోని బనగానపల్లెను రెవన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మంత్రులు అనగాని సత్య ప్రసాద్, నాదెండ్ల మనోహర్ అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు సమక్షంలో ఈ అంశంపై సమగ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు సూచనలు... మార్గ దర్శకాల మేరకు పలు అంశాల పరంగా క్షుణ్ణంగా పరిశీలించారని తెలిసింది. ఏదేమైనా జిల్లాలో బనగానపల్లెను రెవెన్యూ డివిన్‌గా ఏర్పాటు చేస్తే ఐదు మండలాలకు ఊరట కల్పించే విషయం.

గతంలో నంద్యాలలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాగా ఉన్నప్పుడు బనగానపల్లె నియోజక వర్గం నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో ఉండేది. కర్నూలు, నంద్యాల జిల్లాల మార్పు నేపథ్యంలో డోన్ రెవెన్యూ డివిజన్‌లోకి బనగానపల్లెను చేర్చారు. అయితే తాజాగా జిల్లాల పునర్విభజన నేపథ్యంలో డోన్‌ను కర్నూలు జిల్లాలోకి కలపాలనే ప్రతి పాదన కూడా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా బనగా నపల్లె రెవెన్యూ డివిజన్ చేయాలని తెరపైకి వచ్చినట్లు సమా చారం. ఏది ఏమైనా బనగానపల్లె ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే.. సదరు రెవెన్యూ డివిజన్‌లోని బనగానపల్లె మండల ంతో పాటు కోయిలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాలకు చెందిన ప్రజలకు ఊరట కలిగించే విషయం.

త్వరలో ప్రభుత్వం దృష్టికి..

జిల్లాల పునర్విభజనతో పాటు రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుపై కూడా సదరు కమిటీ లోతుగా పరిశీలించినట్లు తెలుస్తోంది. జిల్లాల నుంచి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త జిల్లాలతో పాటు రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుపై తుది జాబితాను త్వరలో సీఎం చంద్రబాబుకు అందజేయ నున్నారు. బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయం తెరపైకి రావడంతో చర్చనీయాంశంగా మారింది. డోన్ రెవెన్యూ డివిజన్ పరిస్థితి ఏంటి..? ఒకవేళ డోన్‌ను కర్నూలులో కలుపుతారా..? అనే సందేహాలు లేకపోలేదు.

అణగారిన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



పూజలో పాల్గొన్న స్పీకర్

సంజామల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పేరుసోమల విష్ణుకంటి క్షేత్రంలో వెలిసిన కంబగిరి స్వామి ఆలయంలో స్పీకర్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు రామ్మోహన్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్బంగా తహసీల్దార్ అనిల్‌కుమార్, కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్, ఎస్ఐలు రమణయ్య, మల్లికార్జున రెడ్డి, ఆలయ నిర్వాహకులు ఆయన కు ఘనస్వాగతం పలికారు. కంబగిరిస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కంబగిరిస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు మర్యాదపూర్వకంగా స్పీకర్‌ను కలిశారు. రెండు రాష్ట్రాల్లో బీసీల అభివృద్ధిపై చర్చించారు.


కుల, చేతి వృత్తిదారుల ఉపాధే లక్ష్యం

కర్నూలు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుల, చేతి వృత్తిదారుల ఉపాధే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. బుధవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఆదరణ 3.0 పథకం అమలుపై నాయి బ్రాహ్మణులకు ఆధునిక సంగీత పరికరాల పనిముట్లు ఇవ్వడంపై చర్చించారు. కిలార్నట్, డోలు, రండోలు, తాషా, సాక్సోఫోన్ వంటి ఆధునిక సంగీత పరికరాలు, అత్యాధునిక రాజహంస చైర్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..

- మల్లేశ్వరస్వామి ఆలయం
- కార్తీకమాసంలో ప్రత్యేకపూజలు

రుద్రవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉల్లెండకొండ మల్లేశ్వరస్వామి ఆలయం. కార్తీకమాసంలో ఇక్కడి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఉల్లెడకొండ వద్ద అశ్వతామ మహర్షి తపస్సు చేసిన గుహలు ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. ఈ గుహలను అశ్వత్థామ గుహలుగా పిలువబడతాయని భక్తులు చెబుతున్నారు. ఇక్కడ ప్రకృతిగా ఏర్పడిన పెళ్లిపందిరి ఉంది. గలగలపారే సెలయేర్లు ఒక వైపు, ఎత్తయిన కొండలు, కొండకు ప్రకృతి దేవతాశిల్పాలు ఏర్పడ్డాయి. ఆళ్లగడ్డ- అహోబిలం నుంచి నాగంబాయి వద్ద నుంచి దారి ఉంది. ఈ దారి ఉల్లెడకొండకు చేరుకోవడానికి నల్లమల అడవిలో 18కిలోమీటర్లు ప్రయాణించాలి. ఉల్లెడ కొండ కొండపై ప్రకృతి శిల్పకళ ఉంది. గుహలో స్వయంభువుడుగా నాగశేషుడు, శివలింగం ఏర్పడ్డాయి. కర్నూలు - నంద్యాల, ప్రకాశం కడప జిల్లాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. స్వామి దర్శనంతో పాటు ప్రకృతి అందాలు, ఎత్తయిన కొండలు ప్రకృతి శిల్పసంపదను భక్తులకు కనువిందు చేస్తుంటాయి. నల్లమలలో దేవతలు పెళ్లిళ్ల చేసుకున్న ప్రకృతి పందిరి ఉంది. కొండల మధ్య సెలయేరు ప్రవహిస్తుంది. కొండ ప్రకృతి పందిరిలా దర్శనమిస్తుంది.



నల్లమలలో ఉల్లెడ కొండ

బాల్యం నుంచే శాస్త్రీయ దృక్పథం ఉండాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బాల్యం నుంచే శాస్త్రీయ దృక్పథం బాల్యం నుంచే పెంపొందించాలని క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా.హెచ్.అక్తర్‌బాను సూచించారు. నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పాఠశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. సిల్వర్ జూబ్లీ కళాశాల అధ్యాపకుడు డా.ఎల్లకృష్ణ, బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు రఘుబాబు, కార్యదర్శి రమణారెడ్డి, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి



వైఎస్ షర్మిలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి జె.లక్ష్మినరసింహ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు కలిశారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతం, పార్టీ నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని ఆమె సూచించారు.

మంద కృష్ణను కలిసిన నాయకులు



ఫొటో ఫ్రేం ఇస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను జిల్లా దళిత నాయకులు హైదరాబాద్‌లోని నివాసంలో బుధవారం కలిశారు. సీఎం చంద్రబాబుతో ఉన్న ఫోటోఫ్రేమ్‌ను బహూకరించారు. జిల్లా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మంద కృష్ణ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే రాష్ట్రంలో పర్యటిస్తానన్నారు. సందెపోగు రాజశేఖర్, బి.రమేష్, సునీల్, మహేష్, వెంకటేశ్, భూషన్ ఉన్నారు.

నిరాశ్రయుల వసతి గృహం తనిఖీ



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ నగర్‌లోని వేదాస్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధ వారం తనిఖీ చేశారు. ఓ గది పైకప్పు పెచ్చులూడిన విషయాన్ని గమనించి వెంటనే మరమ్మతులు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. తమకు ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని నిర్వాహకురాలు ఆయన దృష్టికి తీసుకురాగా, అధికారులతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. నీరు, ఆహారం, దుప్పట్లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులను మెరుగు పరుచుకోవాలని సూచించారు.

ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌లకు సన్మానం



ట్రైనీ కలెక్టర్లతో దొడ్డిపాడు మహబూబ్‌బాషా

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు మహబూబ్ బాషా, ఎంపీటీసీ మునిస్వామి ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌లను సన్మానించారు. బుధవారం పెద్దటేకూరు, దొడ్డిపాడులోని సచివాలయంలో ట్రైనీ కలెక్టర్లు స్వర్ణ పంచాయతీ, జీఎస్‌డబ్ల్యూ పోర్టల్‌కు సంబంధించి ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు.

గురుకుల పాఠశాలలో మాక్ ఎలెక్షన్స్



మాక్ ఎలెక్షన్స్‌లో పాల్గొన్న విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిన్నెదేవరపాడు అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం మాక్ ఎన్నికలు నిర్వహించారు. లెర్నింగ్ ఎక్స్‌లెన్స్‌లో భాగంగా ఎన్నికల నిర్వహణ, ఆవశ్యకత, ప్రజాస్వామ్య విలువలను తెలియజేసినట్లు డీసీడీవో యమున, హెచ్ఎం నిర్మల అన్నారు.

శనగను కాపాడుకోండి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో రవిప్రకాష్

కోడుమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎండు తెగులు నుంచి శనగను కాపాడుకోవాలని ఏవో రవిప్రకాష్ సూచించారు. బుధవారం కోడుమూరులోని ఓ రైతు పొలంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా భూమిలో తేమ ఉన్నందున శనగకు ఎండు తెగులు సోకి మొక్క పసుపు రంగులోకి మారనుందన్నారు. నివారణకు రైతులు ఎకరాకు కార్బన్‌డైజం లేదా మాంకోజెబ్ 500 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. పచ్చ గుడ్డు నివారణకు వేప నూనె ఎకరాకు లీటర్ చొప్పున పిచికారీ చేస్తే పంటను కాపాడుకోవచ్చని వివరించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం ప్రాక్టీసు మెటీరియల్‌ను మైనార్టీ వెల్ఫేర్ అధికారి సబీహా పర్వీన్ పంపిణీ చేశారు. వినియోగించుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. హజ్ కమిటీ కార్యదర్శి నూరి మన్సూర్ అలీఖాన్, హెచ్ఎం పుష్పరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీక వైభవం

- నగరంలోని నాయక ఘాట్, తుంగభద్ర నదీ తీరాల్లో కార్తీక దీపోత్సవాలు
- పోటెత్తిన భక్తులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేసీ కెనాల్, తుంగభద్ర నదీ తీరాల్లో బుధ వారం రాత్రి మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. అధికారులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఘాట్‌కు ఇరువైపులా విద్యుత్ దీపాలతో అలంకరించి, కాషాయ పతాకాలను ఏర్పాటు చేశారు. అటు మద్దూర్ నగర్, ఇటు కలెక్టరేట్ వరకు మైకు ద్వారా కార్యక్రమాలను ప్రసారం చేశారు. సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. సప్తగిరి నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలోని శివాలయం నుంచి శివపార్వతుల విగ్రహాలను ఊరేగింపుగా వినాయక ఘాట్‌కు తీసుకు వచ్చారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి దీపోత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం 7 గంటలకు మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి బృందం ఆధ్వర్యంలో తుంగభద్రమ్మ నదికి తుంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కేడీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఇ.పద్మావ తమ్మ, జె.రాధిక, ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.దేవకీదేవి, ఇతర ప్రతినిధులు జయలక్ష్మి, జి.వరలక్ష్మి, పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



దీపోత్సవాలను ప్రారంభిస్తున్న టీజీ రాజ్యలక్ష్మి



బళ్లారి రోడ్డు వై.జంక్షన్‌లోని గురుదత్త శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



హరిహరక్షేత్రంలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న చంద్రశేఖర్..



జగన్నాథగట్టుపై అఖండ దీపోత్సవం




దక్షిణ షిరిడీ ఆలయంలో కాచిన పాలు





దీపాలు వెలిగిస్తున్న మహిళలు, యువతులు



నగరంలోని అపార్ట్‌మెంట్‌లో కార్తీకదీపాలు

నగరంలోని బళ్లారి చౌరస్తాలోగల వై.జంక్షన్ సమీపంలోని శివాలయంలో మహిళలు సామూహిక దీపోత్సవాలను నిర్వహించారు. పాతనగరంలో దక్షిణ షిరిడీగా వినతికెక్కిన షిరిడీ సాయిబాబా దేవస్థానంలో వేడుకలను నిర్వహించారు. సాయంత్రం మహిళలతో సామూహిక దీపోత్సవాలు, వెన్నెలలో కాచిన పాలను భక్తులు పంపిణీ చేశారు. అనంతరం జ్వాలాతోరణం నిర్వహించారు. కమిటీ కార్యదర్శి ఎస్‌జీ మహాబలేష్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. నగర శివారు జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం దేవదాయశాఖ జోనల్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఏసీ బి.సుధాకర్‌రెడ్డి పూజలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై గుర్రెడ్డి, క్లర్కు సుబ్బారెడ్డి, ఆదినారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లకు అదనపు పోలింగ్ కేంద్రాలు

- కర్నూలు నియోజకవర్గ ఆర్వో పి.విశ్వనాథ్



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓటర్లు సౌకర్యవంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కరూనల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతమున్న 258 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 60 కేంద్రాల ఏర్పాటుపై చర్చించామన్నారు. గత అనుభవాల ఆధారంగా ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఒక్కో కేంద్రానికి 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు, బీఎల్‌వోలు, సంయుక్తంగా 60నూతన పోలింగ్ బూత్‌లు, 11 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పులు, 25 పోలింగ్ కేంద్రాల మార్పులు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిదులు ఏకగ్రీవంగా ఆమోదించారని, అందరి ఆమోదంతో ఈ మూడు అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు ఆర్వో తెలిపారు. అర్బన్ తహసీల్దార్ రవికుమార్, డీటీ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండ

కోడుమూరు/కర్నూలు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సభ్యత్వం ఉండి మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పసుపులలోని స్వగృహంలో ప్రమాద బీమా కింద మంజూరైనా రూ.25లక్షల చెక్కులు అందజేశారు. కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు బలరాం తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

ఓర్వకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా నాగ అనసూయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు పదోన్నతిపై నంద్యాల జిల్లా డ్వామా అకౌంట్స్ ఆఫీసర్‌గా వెళ్లారు. అవుకు మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న నాగ అనసూయకు పదోన్నతి కల్పిస్తూ ఓర్వకల్లు ఎంపీడీవోగా అధికారులు నియమించారు. టీడీపీ కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎంపీడీవోను కలిసిన నాయకులు, సిబ్బంది

బీసీ కార్పొరేషన్లను ఆదుకుంటాం

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జానాభా దామాషా మేరకు కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. బీసీ పాలక మండళ్లకు నిధులు ఇవ్వాలని నిర్ణయించామని, సీఎం చంద్రబాబు త్వరలో తీపి కబురు చెబుతారని వివరించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కె.పార్వతమ్మ 26 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పత్తి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళనం పోస్టర్లను విడుదల చేశారు. 18,19 తేదీల్లో ఆదోనిలో నిర్వహిస్తున్నట్లు పత్తి రైతులు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్వింటానికి రూ.12 వేల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా పంట తీవ్రంగా దెబ్బతినిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సి.మహేష్, బి.రాముడు, పి.పుల్లన్న, దొడ్డిపాడు భాష, నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి

సి.బెళగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రైతు వెంకటేశ్వర్లు కంది పొలంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పత్తి రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని వెళ్లి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.



కందిపంటను పరిశీలిస్తున్న ఏవో

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోజా వీధి-1 అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.ఉమా తనిఖీ చేశారు. శీతలీకరణ యంత్రాలు, ఐఎల్ఆర్‌డీ ఫ్రిజ్‌ను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల నిల్వలను తెలుసుకున్నారు. 0-5 సంవత్సరాల పిల్లలకు, గర్భిణులకు వేసిన టీకాల వివరాలను యూవిన్ మరియు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ డా.పాతిమా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శాలివాహన సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాలివాహన, కుమ్మరి కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ కార్పోరేషన్ చైర్మన్ పీటీవీ సుబ్బయ్య తెలిపారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ సమస్యల విషయమై రెండు రోజుల క్రితం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితతో చర్చించామని, ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. కుమ్మరి కులస్థులకు రుణాలు, ఆదరణ పథకం, నగరంలో మొల్ల విగ్రహ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నామన్నారు.



సుబ్బయ్య

వలస వెళ్లకుండా చూడాలి

సి.బెళగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వలస వెళ్లకుండా పాఠశాల హెచ్ఎంలు చూడాలని ఎంఈవో ఆదాంబాషా ఆదేశించారు. బుధవారం మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు వలస వెళ్లితే వారి పిల్లలను తీసుకువెళ్లకుండా చూడాలన్నారు. భోజనాన్ని మెనూ ప్రకారంగా వడ్డించాలన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

కోడుమూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో గుండెపోటుతో రైతు జయన్న (55) మృతి చెందాడు. వివరాల మేరకు.. నాలుగు ఎకరాల పొలంతోపాటు ఎకరా కౌలుకు తీసుకున్నారు. ఉల్లి, కంది, పత్తి సాగు చేశాడు. బుధవారం పొలానికి వెళ్లాడు. కుమారుడు ఫోన్ చేయగా స్పందించలేదు. కుమారుడు రవికుమార్ పొలానికి వెళ్లి చూడగా అచేతనంగా పడి ఉండటంతో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్యవైశ్యులకు టీడీపీ పాలనలోనే గుర్తింపు

కర్నూలు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు టీడీపీ పాలనలోనే గుర్తింపు వచ్చిందని కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర అన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మార్చం పట్ల సీఎం చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ మంత్రి టీజీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్ పట్టుదలతో సఫలీకృతమయిందని తెలిపారు. పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహంతో పాటు స్మృతివనం ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.



లోకేశ్‌తో నాగేంద్ర

డీసీఎంఎస్ సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి

డీసీఎంఎస్‌లో సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ కోరారు. బుధవారం మంగళగిరిలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఉమ్మడి జిల్లాలో ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ను కలిసి జిల్లాలో పార్టీ బలోపేతం, కార్యకర్తలు, నాయకుల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో నాగేశ్వర రావు యాదవ్

పక్కాగా కబ్జా..!

(5వ పేజీ తరువాయి)

ఆ స్థలంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఓహెచ్ఆర్ ట్యాంక్ ప్రభుత్వం నిర్మించారు. నగరం విస్తరణతో పాటుగా భూముల విలువ భారీగా పెరగడంతో ఎకరం రూ.కోట్లు పలుకుతోంది. ప్రస్తుతం ఆ కాలనీల్లో సెంటు స్థలం విలువ రూ.25-30 లక్షలు పైమాటే. అంటే.. నిర్మల్ నగర్ పార్కు స్థలం బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.25-30 కోట్లు పైగానే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎంతో విలువైన ఈ స్థలంపై గత వైసీపీ హయాంలో ఆ పార్టీ చెందిన కొందరు కన్నేశారు.

బోగస్ పట్టాలు సృష్టించి

లే-అవుట్ కాలనీల్లో ప్రజా అవసరాలు (పాఠశాలలు, ఆస్పత్రులు, ఉద్యానవనాలు పెంపకం) కోసం కేటాయించిన ఖాళీ స్థలాల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు ఇంటి స్థలం పట్టాలు ఇవ్వకూడదు. ఇతర నిర్మాణాలు చేపట్టరాదని అధికారులే అంటున్నారు. నిర్మల్ నగర్ పార్కు స్థలంపై కన్నేసిన అక్రమార్కులు పక్కా ప్రణాళికతో కబ్జాకు ఎత్తులు వేశారు. 2013లో కల్లూరు మండలం తహశీదారుగా పని చేసిన ఓ రెవిన్యూ అధికారి జారీ చేసినట్లు 'నివాస స్థల స్వాధీన ధృవీకరణ పత్రం' పేరిట ఇంటి పట్టాలను సృష్టించారు. ఒక్కొక్కరికి 83-92 చదరపు గజాల విస్తీర్ణంలో ఐదు గురికి 8-10 సెంట్లు ఇచ్చినట్లు అందులో చూపించారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఆ స్థలం విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పట్టాలను పరిశీలిస్తే.. పట్టా జారీ చేసిన తేదీ వేయలేదు. ఏ తహశీల్దారు కూడా పార్క్ స్థలంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటి స్థలాలు ఇవ్వరని అధికారులే అంటున్నారు. అంతేకాదు.. పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా సరిహద్దు చుట్టూ ప్రహరి నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన కార్పొరేషన్ అధికారులు ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. దీంతో కన్నేసిన అక్రమార్కులు బోగస్ పట్టాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కబ్జాదారులు చూపుతున్న ఇంటి స్థలం పట్టాలపై రెవిన్యూ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు విచారణ, సర్వే చేయాలని, ఎంతో విలువైన పార్కు స్థలాన్ని రక్షించాలని కోరుతున్నారు. అలాగే.. అవి బోగస్ పట్టాలని తేలితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పార్కు కబ్జా కాకుండా రక్షించాలి




గురు రాఘవేంద్ర నగర్ ఎల్‌పీ నంబరు - 121/1981లో ప్రజల అవసరాలు, పార్కు కోసం 1.01 ఎకరాలు ఖాళీ స్థలం (ఓపన్ సైట్) వదిలారు. పార్కు చుట్టూర ప్రహరీ కట్టకపోవడంతో కొందరు అక్రమిం చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదుగురు వ్యక్తులకు కల్లూరు తహశీల్దారు ఇంటి పట్టాలు ఇచ్చారని అంటున్నారు. పార్కు స్థలంలో ఇంటి పట్టాలు ఎలా ఇస్తారు..? అవి ఒరిజినల్ పట్టాలా.. బోగస్ పట్టాలా..? అధికారులు తేల్చాలి. సర్వే 304/1లో ఉన్న పార్కును చుట్టూ రక్షణ గోడలు నిర్మించి కబ్జా కాకుండా రక్షించాలి. **-యు.మాదన్న, టీడీపీ క్లస్టర్-10 ఇన్‌చార్జి, గీతా నగర్, కల్లూరు**

అవి బోగస్ పట్టాలు



గురు రాఘవేంద్ర పార్కు స్థలంలో 2013లో ఐదుగురు వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలు ఒరిజనలా.. కాదా..? నివేదిక ఇవ్వమని కర్నూలు నగరపాలక అధికారులు లేఖ రాశారు. వారి లేఖలో చూపిన వివరాల ప్రకారం రెవిన్యూ రికార్డులు పరిశీలిస్తే అవి బోగస్ పట్టాలని తేలింది. వాటికి సంబంధించి మా కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేవు. ఇదే విషయం కార్పొరేషన్ అధికారులకు వివరాలతో లేఖ రాశాం. **- ఆంజనేయులు, తహసీల్దారు, కల్లూరు**

చర్యలు తీసుకుంటాం



గురు రామవేంద్ర నగర్ ఎల్‌పీ121/1981 లో పార్కు స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. లే-అవుట్ పార్కు స్థలాల్లో ఇంటి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనలు ఒప్పుకోవు. ఎవరైనా కబ్జాకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పార్కు స్థలం సరిహద్దులు గుర్తించి ప్రహరీ నిర్మించడమే కాకుండా అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- పి. విశ్వనాథ్, కమిషనర్, కర్నూలు కార్పొరేషన్

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మద్దికెర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి శిష్యురాలు పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకుని గంగ పూజ చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దైవ మార్గం వైపు నడవాలి


స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు

మద్దికెర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దైవమార్గంలో నడవాలని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు జితేంద్రగౌడు అన్నారు. బుధవారం షుద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామిని జితేంద్రగౌడు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. 26, 27, 28 తేదీల్లో జరిగే షష్టి ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు చూపలేదు


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

మద్దికెర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాల పక్కనే పదేళ్ల క్రితమే 30 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇంత వరకు రెవెన్యూ అధికారులు స్థలాలు చూపలేదని టీడీపీ నాయకులు రమేష్ యాదవ్, ఆనంద్‌కుమార్, హుశేన్ పీరా, శీనప్ప అన్నారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రెండున్నర సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థలాలు ఇవ్వకుండా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. మాకు స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ విచారణ చేసి పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బురుజుల విజయుడు, తహసీల్దార్ గూండాల్ నాయక్, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి: ఆర్డీవో


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

మద్దికెర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చదువుతో పాటు మంచి భోజనాన్ని అందించాలని ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశీలించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సులభపద్ధతిలో బోధన అందించాలన్నారు. ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గూండాల్ నాయక్, ఏపీవో నర్సిరెడ్డి, ఏవో రవి, సర్పంచ్ బురుజుల విజయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి, వీఆర్వో స్వర్ణలత, కార్యదర్శి విజయ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ నిర్మాణాలు పూర్తి చేయండి

దేవనకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండింగ్‌లో ఉన్న పీఎంఏవై గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో జ్యోతి, హౌసింగ్ ఏఈ అనిరుద్ తెలిపారు. బుధవారం మండలంలోని గుండ్లకొండలో వారు పర్యటించి పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల గృహాలను పరిశీలించారు. 2021లో మండలంలో పీఎంఏవై 1లో అర్బన్ కింద 1010 గృహాలు మంజూరు కాగా, 785 పూర్తైయ్యాయి. వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న 225 గృహ నిర్మాణాలు త్వరిగతిన పూర్తి చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నబిరసూల్, ఇంజనిరింగ్ అసిస్టెంట్ అనిష్, తదితరులు ఉన్నారు.

వేదవతి పూర్తి చేయాలి

హాలహర్వి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో వేదావతి ప్రాజెక్టు పూర్తి చేయాలని పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం తాలూకా నాయకులు నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆయన జీపుజాత కార్యక్రమం సందర్భంగా మాట్లాడారు. గూళ్యం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ప్రాజెక్టు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న నల్లగుట్టలో పేదలు భూపోరాటం ద్వారా ఆక్రమించుకున్న స్థలాలకు పట్టాలు ఇచ్చి గృహాలను నిర్మించి ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు నెట్టెకంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని కర్నూలు రోడ్డులోని సర్వేనంబర్ 699లో నల్లగుట్ట ప్రాంతంలో 2023 సంవత్సరంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పేదలు స్థలాన్ని ఆక్రమించి, ఇళ్ల స్థలాలను ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఇప్పటివరకు అధికారులు పట్టాలు ఇవ్వలేదని, ఆక్రమించిన స్థలాల్లో అనేకమంది పేద కార్మికులు ఇళ్ల నిర్మాణం, గుడిసెలు వేసుకోవడం జరిగిందన్నారు. తక్షణమే కాలనీకి పక్కా గృహాలు మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌నకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు వీరన్న, కారన్న, రంగన్న, మాదన్న, రాజప్ప, ఉచ్చన్న పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికే సముచిత న్యాయం

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


నూతన మండల కమిటీతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి టీడీపీలో సముచిత న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, క్రిష్ణగిరి మండలాల పరిధిలో నూతన ఎంపికైన మండల కమిటీ సభ్యులను ఆయన సన్మానించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కోసం పనిచేసిన నాయకులపై వైసీపీ నాయకులు వేధింపులకు గురిచేయడంతోపాటు అక్రమ కేసులతో ఇబ్బందులు పెట్టారన్నారు. వేధింపులు, అక్రమ కేసులు తట్టుకొని ఎందరో నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం పనిచేశారన్నారు. అలాంటి వారందరిని గుర్తించి పార్టీలో వారికి గౌరవస్థానాన్ని కల్పిస్తున్నామని పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న సభ్యులు మరింతగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట రాముడు, మనోహర్‌చౌదరి, రామానాయుడు, తిమ్మయ్యచౌదరి, బత్తిన లోక్‌నాథ్, తిరుపాలు, సోమ్లనాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబి తదితరులు పాల్గొన్నారు.

మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్.లక్ష్మీనారాయణ


ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును సన్మానిస్తున్న లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు

మద్దికెర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలో నివసించే లక్ష్మీనారాయణ మండల టీడీపీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బుధవారం పత్తికొండ పట్టణంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సమక్షంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడుగా పెరవలి గ్రామానికి చెందిన మెడికల్ తిమ్మప్పను ఎన్నుకున్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోమాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ నాయకులు గడ్డం రామాంజులు, జంబునాథ్ రాయుడు, బాషా, భీమ రాజు, శంకర్ తదితరులు ఉన్నారు.

'అంతర పంటలతో అధిక ఆదాయం'


మాట్లాడుతున్న శ్రీలత

వెల్దుర్తి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రధాన పంటలపై ఆధాపడకుండా ప్రధాన పంటలతో పాటు వ్యవసాయంలో అంతర పంటలు సాగు చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని ఆత్మ పీడీ శ్రీలత తెలిపారు. బుధవారం మండలంలోని బింగిదొడ్డి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు అగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పంటల్లోని సమగ్ర ఎరువుల యజమాన్యం, భూసార పరీక్షల ఆవశ్యకతపై జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.సతీష్ రైతులకు తెలిపారు. మదార్‌పురం గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, పత్తికొండ వ్యవసాయ సంచాలకులు ఏ.మోహన్ విజయకుమార్, శాస్త్రవేత్త వైఎస్ సతీష్, ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, ఏవో వెంకటరంగారెడ్డి, బిగిదొడ్డి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, మండల వ్యవసాయాధికారి అక్బర్ బాషా పాల్గొన్నారు.

విజేతగా పోలీసు టీమ్


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను పత్తికొండలో సీఐ జయన్న, పులిశేఖర్‌ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పోలీసు, డాక్టర్స్, అడ్వకేట్స్, జర్నలిస్టు టీమ్‌లు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై పోలీసు టీమ్ తరపున ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు. ముందుకు పోలీసు వర్సెస్ అడ్వకేట్ టీమ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో పోలీసు టీమ్ గెలిచింది. జర్నలిస్టు వర్సెస్ డాక్టర్స్ మ్యాచ్‌లో జర్నలిస్టు టీమ్ విజయం సాధించింది. ఫైనల్స్‌లో పోలీసు వర్సెస్ జర్నలిస్టు మ్యాచ్‌లో పోలీసు టీమ్ విజేతగా నిలిచింది. జర్నలిస్టు టీమ్ రన్నర్స్‌గా నిలిచింది. ఎమ్మెల్యే శ్యాంబాబు విన్నర్స్, రన్నర్స్ టీమ్‌లకు బహుమతులు అందజేశారు. ఆర్డీవో భరత్‌నాయక్, డీఎస్పీ వెంకట్రామయ్య, వైద్యాధికారి కల్పనతో పాటు టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, తిమ్మయ్య చౌదరి తదితరులు హాజరయ్యారు.

ఆలూరు ప్రాంతానికి సాగు, తాగునీటికై పాదయాత్ర

ఆలూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంతానికి జీవనాధారం కోసం సాగు, తాగునీటికై వేదావతి ప్రాజెక్టు నగరడోన రిజర్వాయర్ సాధనకై ఈనెల 9, 10న తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, నారాయణస్వామి అన్నారు. వేదావతి, నగరడోన ప్రాజెక్టుల నిర్మాణం కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆలూరులో జీపుజాతా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు ప్రాంతానికి వనరులు ఉన్న వాటిని ఉపయోగించుకోలేని ప్రభుత్వాలు, పాలకులు ఉన్నంతకాలం దుర్భిక్షం ఉంటుందన్నారు. రైతులలో, ప్రజల్లో చైతన్యంతో తిరుగుబాటు చేస్తేనే ప్రభుత్వాలు దిగొస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు క్రిష్ణ, ఈరన్న, పరమేష్, సద్దాం, శివ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు భూములను అభివృద్ధి చేయాలి

తుగ్గలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి చెరువు కింద ఆయకట్టు భూములను అభివృద్ధి చేయాలని తాలుకా తెలుగు రైతు అధ్యక్షుడు బాలన్న, టీడీపీ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్, విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవి కోరారు. బుధవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి జొన్నగిరిలోని సమస్యలు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే చెరువు కింద ఉన్న ఆయకట్టు భూముల్లో ఉన్న కంప చెట్లను తొలగించి సాగులోకి తెస్తామని రైతులెవరూ అధైర్యపడకండని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలరాముడు, వెంకటేష్, శ్రీనివాసులు ఉన్నారు.

సారూ.. రక్షణ కల్పించండి

● భార్య, ఆమె ప్రియుడితో ప్రాణహాని

పత్తికొండ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్య, ఆమె ప్రియుడితో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పులికొండ పోలీసులను వేడుకున్నాడు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు భార్య స్వాతి, ముగ్గురు పిల్లలని, టీవీ మెకానిక్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన వంశీ అనే యువకుడితో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందన్నారు. ఈనెల 3వ తేదీన వంశీ తనపై దాడి చేశాడు. ఈ విషయమై పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. పోలీసులు అతడిని అరెస్టు చేయలేదని, దీంతో భార్య, ఆమె ప్రియుడు వంశీతో తనకు ప్రాణహాని ఉందని వాపోయాడు. సీఐ జయన్న వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామని, త్వరలోనే దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేస్తామని తెలిపారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డప్పు ఆనంద్‌బాబు

వెల్దుర్తి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారుల పెన్షన్ ఆన్‌లైన్‌ను వెంటనే విడుదల చేయాలని డప్పు కళాకారుల పెన్షన్ పెంచాలని డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం వెల్దుర్తిలోని సీఐటీయూ కార్యాలయంలో అనంతరం నూతన డప్పు కళాకారుల సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శిగా రత్నపల్లె మధు, ఉపాధ్యక్షులుగా బోయినపల్లె తిరుపాలు, నరసాపురం లక్ష్మన్న, సర్పరాజాపురం పెద్దమద్దయ్య, మండల సహాయ కార్యదర్శులుగా ఎల్‌బండ బలరాముడు, నర్సాపురం స్వాములు, బోయినపల్లె నారాయణ, రత్నపల్లె రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ననాయకులు రాజు, కాటికాపర్ల సంఘం మండల నాయకులు సుంకన్న పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

వెల్దుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో నర్సాపురం గ్రామ వైసీపీ నాయకుడు నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి అయ్యప్పస్వాముల అన్నదానానికి రూ.5 వేలు విరాళం అందజేశారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో వెలసిన అయ్యప్పస్వామికి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి శ్రీధర్‌స్వామి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సచివాలయ సిబ్బందికి మెమో జారీ

వెల్దుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న 18 సచివాలయల పరిధిలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో సుహాసినమ్మ బుధవారం మెమోలు జారీచేశారు. సిటిజన్ ఈ కేవైసీ సర్వేలో కర్నూలు జిల్లాలో వెల్దుర్తి మండలం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మెమోలు జారీచేసినట్లు ఎంపీడీవో తెలిపారు. 24 గంటల లోపు లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని తెలిపారు. లేనిచో ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం చేస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవనకొండకి చెందిన పోల్‌కల్ రంగన్న (60) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. రంగన్న మృతి విషయం తెలుసుకొని స్థానిక టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, మలకన్న, వాటరొషెడ్ మధు అంత్యక్రియల కోసం రూ.5 వేలు మృతుడి భార్య సావిత్రమ్మకు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు కుడా మృతుడి కుటుంబానికి రూ.56 వేలు అందజేశారు. రాజాసాబ్, బాలకృష్ణ, రాముడు, చాంద్‌బాషా ఉన్నారు.

తుగ్గలి టీడీపీ మండల కమిటీ ఎంపిక


ఎమ్మెల్యేను సన్మానం చేస్తున్న నాయకులు

తుగ్గలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ మండల కమిటీలను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సమక్షంలో ఎంపిక చేశారు. మరోసారి తుగ్గలి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాంపల్లి తిరుపాల్ నాయుడు, రాంపురంకొట్టాల వెంకట్రాముడు చౌదరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పత్తికొండ టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఆర్గనైజింగ్ కమిటీ జనరల్ సెక్రటరీగా ప్రసన్నలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మారెన్న, ఎడవలి తిమ్మప్ప, సోమశేఖర్ గౌడు, క్యాదర్శులుగా లక్ష్మణ్ నాయక్, రంగారెడ్డి, మండల కోశాధికారిగా శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్ యాదవ్, గిరిగిట్ల మల్లి, శభాష్‌పురం మోహన్ ఉన్నారు.

క్రిష్ణగిరి మండల టీడీపీ అధ్యక్షుడిగా దామోదర్ నాయుడు


ఎమ్మెల్యేతో నూతన అధ్యక్షుడు

క్రిష్ణగిరి, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా రామకృష్ణాపురం దామోదర్ నాయుడు బుధవారం బాధ్యతలు తీసుకున్నాడు. మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. మండలంలో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

పక్కాగా కబ్జా..!

5వ పేజీ తరువాయి

ఆ స్థలంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఓహెచ్ఆర్ ట్యాంక్ ప్రభుత్వం నిర్మించారు. నగరం విస్తరణతో పాటుగా భూముల విలువ భారీగా పెరగడంతో ఎకరం రూ.కోట్లు పలుకుతోంది. ప్రస్తుతం ఆ కాలనీల్లో సెంటు స్థలం విలువ రూ.25-30 లక్షలు పైమాటే. అంటే.. నిర్మల్ నగర్ పార్కు స్థలం బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.25-30 కోట్లు పైగానే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎంతో విలువైన ఈ స్థలంపై గత వైసీపీ హయాంలో ఆ పార్టీ చెందిన కొందరు కన్నేశారు.

● బోగస్ పట్టాలు సృష్టించి:

లే-అవుట్ కాలనీల్లో ప్రజా అవసరాలు (పాఠశాలలు, ఆస్పత్రులు, ఉద్యానవనాలు పెంపకం) కోసం కేటాయించిన ఖాళీ స్థలాల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు ఇంటి స్థలం పట్టాలు ఇవ్వకూడదు. ఇతర నిర్మాణాలు చేపట్టరాదని అధికారులే అంటున్నారు. నిర్మల్ నగర్ పార్కు స్థలంపై కన్నేసిన అక్రమార్కులు పక్కా ప్రణాళికతో కబ్జాకు ఎత్తులు వేశారు. 2013లో కల్లూరు మండలం తహశీదారుగా పని చేసిన ఓ రెవిన్యూ అధికారి జారీ చేసినట్లు 'నివాసస్థల స్వాధీన ధృవీకరణ పత్రం' పేరిట ఇంటి పట్టాలను సృష్టించారు. ఒక్కొక్కరికి 83-92 చదరపు గజాల విస్తీర్ణంలో ఐదుగురికి 8-10 సెంట్లు ఇచ్చినట్లు అందులో చూపించారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఆ స్థలం విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పట్టాలను పరిశీలిస్తే.. పట్టా జారీ చేసిన తేదీ వేయలేదు. ఏ తహశీల్దారు కూడా పార్క్ స్థలంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటి స్థలాలు ఇవ్వరని అధికారులే అంటున్నారు. అంతే కాదు.. పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా సరిహద్దు చుట్టూ ప్రహరి నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన కార్పొరేషన్ అధికారులు ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. దీంతో కన్నేసిన అక్రమార్కులు బోగస్ పట్టాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కబ్జాదారులు చూపుతున్న ఇంటి స్థలం పట్టాలపై రెవిన్యూ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు సమగ్ర విచారణ, సర్వే చేయాలని, ఎంతో విలువైన పార్కు స్థలాన్ని రక్షించాలని కోరుతున్నారు. అలాగే.. అవి బోగస్ పట్టాలని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

● పార్కు కబ్జా కాకుండా రక్షించాలి

గురు రాఘవేంద్రనగర్ ఎల్‌పీ నంబరు-121/1981లో ప్రజల అవసరాలు, పార్కు కోసం 1.01 ఎకరాలు ఖాళీ స్థలం (ఓపన్ సైట్) వదిలారు. పార్కు చుట్టూర ప్రహరీ కట్టకపోవడంతో కొందరు అక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదుగురు వ్యక్తులకు కల్లూరు తహశీల్దారు ఇంటి పట్టాలు ఇచ్చారని అంటున్నారు. పార్కు స్థలంలో ఇంటి పట్టాలు ఎలా ఇస్తారు..? అవి ఓరిజినల్ పట్టాలా.. బోగస్ పట్టాలా..? అధికారులు తేల్చాలి. సర్వే 304/1లో ఉన్న పార్కును చుట్టూ రక్షణ గోడలు నిర్మించి కబ్జా కాకుండా రక్షించాలి.

- యు. మాదన్న, టీడీపీ క్లస్టర్-10 ఇన్‌చార్జి, గీతా నగర్, కల్లూరు:

● అవి బోగస్ పట్టాలు

గురురామవేంద్ర పార్కు స్థలంలో 2013లో ఐదుగురు వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలు ఓరిజనలా.. కాదా..? నివేదిక ఇవ్వమని కర్నూలు నగరపాలక అధికారులు లేఖ రాశారు. వారి లేఖలో చూపిన వివరాల ప్రకారం రెవిన్యూ రికార్డులు పరిశీలిస్తే అవి బోగస్ పట్టాలని తేలింది. వాటికి సంబంధించి మా కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేవు. ఇదే విషయం కార్పొరేషన్ అధికారులకు పూర్తి వివరాలతో లేఖ రాశాం.

- అంజనేయులు, తహసీల్దారు, కల్లూరు:

● పార్కు స్థలం రక్షణకు చర్యలు తీసుకుంటాం

గురు రాఘవేంద్ర నగర్ ఎల్‌పీ121/1981లో పార్కు స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. లే-అవుట్ పార్కు స్థలాల్లో ఇంటి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనలు ఒప్పుకోవు. ఎవరైనా కబ్జాకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే పార్కు స్థలం సరిహద్దులు గుర్తించి ప్రహరి గోడ నిర్మించడమే కాకుండా అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- పి. విశ్వానాథ్, కమిషనర్, కర్నూలు కార్పొరేషన్

ఆలయాలకు కార్తీక శోభ

కార్తీక పౌర్ణమి వేడుక సందర్భంగా జిల్లాలో వివిధ ఆలయాలు, ధార్మిక క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం సాయంత్రం పౌర్ణమిని పురస్కరించుకొని వందలాదిగా మహిళా భక్తులు సమీప ఆలయాల్లో పూజాది కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం నోములు, ఉపవాసాలు పాటిస్తూ పూజలు చేశారు. ఊసిరి చెట్టు వద్ద దామోదర పూజలు, తులసి కోటల వద్ద దీపారాధనలు చేపట్టారు.


ఆస్పరి: జొహరాపురంలో రథాన్ని లాగుతున్న భక్తులు


జ్వాలా తోరణం కార్యక్రమంలో పాల్గొన్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి


ఆలూరులోని జలకంఠేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న శివస్వాములు


దేవనకొండ: కోటకొండలోని శివాలయంలో

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ఆదోని, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు డిసెంబర్ 13న ఆదోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు న్యాయసేవ అధికార సంస్థ ప్రకటించింది. రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, మోటార్ ప్రమాదాలకు సంబంధించిన కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కూటమిని విమర్శించే అర్హత ఎమ్మెల్యేకు లేదు

దేవనకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి లేదని వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. రైతులపై కప్పట ప్రేమ చూపుతున్న ఎమ్మెల్యే కూటమి నాయకులపై వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్నదాత సుఖీభవ, ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారం, సీసీఐ ద్వారా పత్తి విక్రయాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలపై అసెంబ్లీకి వెళ్లి మాట్లాడని వారు కూటమి నేతలపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

గ్రామాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



మాధవరంలో రూ. లక్షతో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న రఘునాథరెడ్డి

మంత్రాలయం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ రఘునాథ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో రూ. లక్షతో బీసీ కాలనీలో తాగునీటి పైపులైను పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క రోడ్డును కూడా నిర్మించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకే పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువ పనులకు శ్రీకారం చుట్టారని అన్నారు. మాధవరంలో బీసీ కాలనీకి 70మీటర్ల పైపులైను ఏర్పాటుచేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని అన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, ఉరుకుందు, భీమిరెడ్డి, నాగరాజు, విజయ్‌కుమార్, ఆలం ఉస్సేన్, షైబు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి పంచామృతాభిషేకం



అలంకృతుడైన రాఘవరాయుడి బృందావనం

మంత్రాలయం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పాత ఊరిలో రామలింగేశ్వరునికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బుధవారం కార్తీక పౌర్ణమిని శుభదినాన్ని పురస్కరించుకుని జంగం వీరేంద్రస్వామి, సిద్ధయ్యస్వామి, జంగం సిద్ధలింగయ్య, శ్రీశైలం పాలకమండలి మాజీ సభ్యులు సుజాత, ఆడిట్ శంకర్ పూజలు నిర్వహించారు. తుంగభద్ర జలంతో నిర్మల విసర్జనం, విశేష పంచామృతాభిషేకం చేసి చందనం, విభూతి, మారేడుదలాలు, వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. 108 బిల్వ పత్రాలతో శివ శతనామావళి, నైవేద్యం సమర్పించి మహామంగళ హారతి ఇచ్చారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ: రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి స్వర్ణ కవచ సమర్పణ సేవ నిర్వహించారు. బుధవారం కార్తీక పౌర్ణమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు. పీఠాధిపతి హస్తోదకం చేసి మహామంగళహారతులు ఇచ్చారు.

బాధితులకు అండగా టీడీపీ

బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న అమర్నాథరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

మంత్రాలయం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బాధితులకు టీడీపీ అండగా ఉంటుందని పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, అమర్నాథరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం తమ నివాసంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆదేశాల మేరకు వడ్డె శారదమ్మకు రూ.50వేలు సీఎం సహాయ నిధి కింద మంజూరు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డె వీరేష్, నవకోటి నారాయణ, నర్సా రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తాళ వాయిద్య సాహిత్యం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు

మంత్రాలయం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఉడిపి చెందిన కళాకారులు నిర్వహించిన తాళవాయిద్య సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా యాగశాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి పాటలు అలరించాయి. సంగీత కచేరి చేసిన కళాకారులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నగదు, ఫల, పుష్ప, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వాదించారు. కార్యక్రమంలో హరినాథ్ ఆచార్, పద్మనాభ ఆచార్, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం గౌరవప్రదమైంది



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐ, ట్రైనీ ఎస్ఐ

కోసిగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగం గౌరవ ప్రదమైందని కోసిగి సీఐ మంజునాథ్ అన్నారు. బుధవారం కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో మండలం నుంచి నూతనంగా ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుళ్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. సీఐ మంజునాథ్, ఎస్ఐ రమేష్‌రెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వరరావు నూతన కానిస్టేబుళ్లకు పూలమాలలు, శాలు వలతో సన్మానించారు

జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆర్‌జేడీ విచారణ



విద్యాశాఖ ఆర్‌జేడీ శ్యామూల్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాచాని సోమప్ప జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేశారన్న విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు విద్యాశాఖ రిజనల్ డైరెక్టర్ శ్యామూల్, డీఈవో శ్యామూల్ పాల్ బుధవారం విచారణ చేపట్టారు. విద్యార్థుల నుంచి రాతపూర్వకంగా సమాచారం సేకరించారు. అనంతరం విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ శ్యాముల్ మాట్లాడుతూ హెచ్‌ఎం కృష్ణమూర్తిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులను అందజేస్తామన్నారు. కాగా, హెచ్‌ఎం కృష్ణమూర్తి విచారణ సమయంలో సెలవుపై వెళ్లడం కొసమెరుపు.

కార్తీక శోభ

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న భక్తులు



కోసిగిలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



గోనెగండ్లలోని ఈశ్వరదేవాలయంలో పూజలందుకుంటున్న నీలకంఠేశ్వరుడు



ఎమ్మిగనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తికపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని వీవర్స్ కాలనీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా జ్వాలాతోరణాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయంలో వెలసిన రామలింగేశ్వర స్వామి, సీతారామాంజనేయ స్వామి, సాయిబాబాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు ఉన్న ధ్వజస్థంభంపై దీపాన్ని వెలిగించారు. అనంతరం ఆలయకమిటీ నిర్వాహకులు వేదపండితులు మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య జ్వాలాతోరణాన్ని వెలిగించారు. జ్వాలాతోరణంలో పాల్గొనేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బిజ్జె నాగరాజు, గంగన్న, సత్యన్న, కేవీ నాగరాజు, పూజారులు శ్రీధర్ స్వామి, రామకృష్ణ స్వామి, వరప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్ల, గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

సాయిబాబా ఆలయంలో లక్ష దీపోత్సవం

కోసిగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న లక్ష దీపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే కోసిగిలోని మార్కెండేయస్వామి, ఈశ్వరుని ఆలయం, రేణుకా ఎల్లమ్మ ఆలయం, ఆంజనేయ స్వామి దేవాలయంతో పాటు గ్రామాల్లోని పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, దీపాలు వెలిగించి పూజలు చేశారు. సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, కాగడహారతులు నిర్వహించారు.




కోసిగిలో పూజలందుకుంటున్న సాయిబాబా



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పట్టణంలోని వీవర్స్ కాలనీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న దృశ్యం



గోనెగండ్ల: పూజలు అందుకుంటున్న వీరభద్రస్వామి

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నాయకులు అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఇస్మాయిల్ కోరారు. బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో సభల కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గురువారం నిర్వహిస్తున్న జిల్లా మహాసభకు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం పాల్గొంటున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ కోసం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు, సల్మాన్, రాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల పెంపకంపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యువకులు, డిప్లొమో, బీఎస్ఈ విద్యార్థులతో పాటు రైతులు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. ఈనెల 11వరకు శిక్షణ ఉంటుందని పాల్గొన్నవారికి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. శిక్షణలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకాన్ని ఎలా చేపట్టాలి.. తేనెటీగల పెంపకాన్ని పంటలకు ఎలా సమన్వయం చేసుకోవాలనే విషయాలపై శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. వివరాలకు కేవీకే బనవాసి ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

విచక్షణారహితంగా వాడరాదు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శివశంకర్

ఎమ్మిగనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల్లో విచక్షణారహితంగా పురుగుమందులు, ఎరువులు వాడరాదని ఏవో శివశంకర్ తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పట్టణ శివారులోని సర్దార్‌పురం పొలాల్లో భూమాత రక్షణ కమిటీ, పురుగు మందులు, ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహ, వినోద్, ఎంపీఈవో వెంకటేష్, గ్రామసభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రజా దర్బార్

ఎమ్మిగనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు బుధవారం ఓ ప్రకటన తెలిపారు. ప్రజాదర్బార్ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు ఉంటుందన్నారు. ముందుగా నమోదు విభాగంలో టోకెన్ తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వినతులు స్వీకరించి ఆయా అధికారులకు చర్చించి సమస్యను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తారన్నారు.

నేటి నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు

ఎమ్మిగనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని మంత్రాలయం రోడ్డులో ఉన్న మురారి జిన్నింగ్ మిల్లులో గురువారం నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి రైతులు ఈనెల 11వరకు పత్తిని విక్రయించేందుకు కప్పాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

మహిళ అదృశ్యం



సులోచన (ఫైల్)

గోనెగండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. బుధవారం సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుట్టపాశం గ్రామానికి చెందిన కురువ సులోచన కొన్నేళ్లగా మతిస్థిమితం లేదు. గత శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటకు వచ్చింది. బస్టాండ్ దగ్గర నిలబడి కోడుమూరుకి వెళ్తున్న ఆటో ఎక్కి వెళ్లి పోయింది. విషయం తెలుసుకున్న సులోచన భర్త సుంకన్న కోడుమూరుతోపాటు తన బంధువుల ఇళ్లలో వెతికాడు. జాడ తెలియలేదు. దీంతో గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో సుంకన్న ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రహరీ నిర్మించాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలానికి ప్రహరీ నిర్మించాలని దళిత బహుజన జేఏసీ కన్వీనర్లు నరసప్ప, సుమాల చార్లెస్, గడ్డం నాగేంద్ర కోరారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు వీరభద్రగౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో భూమి విలువలు పెరిగినందున స్థలం కబ్జాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కీర్తన సింగ్, భీమన్న, ప్రసన్న, చిన్న పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు

నందవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపురం గ్రామంలో ఇళ్లస్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తహసీల్దారు, రెవెన్యూ అధికారులు గ్రామంలో పర్యటించి ఎస్సీ కాలనీలో స్థలాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో విచారించి స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ మహేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కాశీంవలి, నాయకులు పీర్ సాబ్, బడేసావలి, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఎస్ఐ రమేష్ రెడ్డికి సన్మానం



ఎస్ఐ రమేష్ రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోసిగి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ డి.రమేష్‌రెడ్డిని బుధవారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చింతలగేని నర్సారెడ్డి, ఆర్లబండ సింగిల్ విండో అధ్యక్షుడు నాడిగేని అయ్యన్నతోపాటు వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎస్ఐ రమేష్ రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎస్ఐ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి గొడవలు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నా రు. టీడీపీ నాయకులు జ్ఞానేష్, నరసింహులు, సాతనూరు కోసిగయ్య, సొట్టయ్య, కందుకూరు అయ్యన్న, మదిరి వీరారెడ్డి, కందుకూరు రామిరెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కోసిగి ఎంపీడీవోగా మహ్మమద్ బాషా



కోసిగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోసిగి నూతన ఎంపీడీ వోగా మహ్మద్ బాషా బుధవారం కోసిగి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. తుగ్గలిలో ఏవోగా పని చేస్తూ పదోన్నతిలో భాగంగా కోసిగి ఎంపీడీవోగా పదోన్నతిపై వచ్చినట్లు ఎంపీడీవో మహ్మమద్ బాషా తెలిపారు. మండలంలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వైఎస్ షర్మిలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సంతకాల పేపర్లను అందజేస్తున్న ఎమ్మిగనూరు కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను విజయవాడలో బుధవారం ఎమ్మిగనూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాశీం వలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ కలిశారు. ఓట్ చోరీపై ప్రజలనుంచి సేకరించిన సంతకాల పత్రాలను ఆమెకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బలోపేతం చేయాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయిలో కార్యకర్తలను పోటీకి నిలపాలని షర్మిల సూచించినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆసీఫ్, శాకీర్, అజయ్, నాయుడులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం అధికలోడ్‌తో ప్రయాణిస్తున్న ఆటోలకు జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి, ఆటోలను సీజ్ చేస్తామన్నారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలన్నారు.

పక్కాగా కబ్జా..!

5వ పేజీ తరువాయి

ఆ స్థలంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఓహెచ్ఆర్ ట్యాంక్ ప్రభుత్వం నిర్మించారు. నగరం విస్తరణతో పాటుగా భూములు విలువ భారీగా పెరగడంతో ఎకరం రూ.కోట్లు పలుకుతోంది. ప్రస్తుతం ఆ కాలనీల్లో సెంటు స్థలం విలువ రూ.25-30 లక్షలు పైమాటే. అంటే.. నిర్మల్ నగర్ పార్కు స్థలం బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.25-30 కోట్లు పైగానే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎంతో విలువైన ఈ స్థలంపై గత వైసీపీ హయాంలో ఆ పార్టీ చెందిన కొందరు కన్నేశారు.

● బోగస్ పట్టాలు సృష్టించి..:

లే-అవుట్ కాలనీల్లో ప్రజా అవసరాలు (పాఠశాలలు, ఆస్పత్రులు, ఉద్యానవనాలు పెంపకం) కోసం కేటాయించిన ఖాళీ స్థలాల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు ఇంటి స్థలం పట్టాలు ఇవ్వకూడదు. ఇతర నిర్మాణాలు చేపట్టరాదని అధికారులే అంటున్నారు. నిర్మల్ నగర్ పార్కు స్థలంపై కన్నేసిన అక్రమార్కులు పక్కా ప్రణాళికతో కబ్జాకు ఎత్తులు వేశారు. 2013లో కల్లూరు మండలం తహశీల్దారుగా పని చేసిన ఓ రెవిన్యూ అధికారి జారీ చేసినట్లు 'నివాసస్థల స్వాధీన ధృవీకరణ పత్రం' పేరిట ఇంటి పట్టాలను సృష్టించారు. ఒక్కొక్కరికి 83-92 చదరపు గజాల విస్తీర్ణంలో ఐదుగురికి 8-10 సెంట్లు ఇచ్చినట్లు అందులో చూపించారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఆ స్థలం విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పట్టాలను పరిశీలిస్తే.. పట్టా జారీ చేసిన తేదీ వేయలేదు. ఏ తహశీల్దారు కూడా పార్క్ స్థలంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటి స్థలాలు ఇవ్వరని అధికారులే అంటున్నారు. అంతేకాదు.. పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా సరిహద్దు చుట్టూ ప్రహరి నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన కార్పొరేషన్ అధికారులు ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. దీంతో కన్నేసిన అక్రమార్కులు బోగస్ పట్టాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కబ్జాదారులు చూపుతున్న ఇంటి స్థలం పట్టాలపై రెవిన్యూ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు సమగ్ర విచారణ, సర్వే చేయాలని, ఎంతో విలువైన పార్కు స్థలాన్ని రక్షించాలని కోరుతున్నారు. అలాగే.. అవి బోగస్ పట్టాలని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

● పార్కు కబ్జా కాకుండా రక్షించాలి

గురు రాఘవేంద్రనగర్ ఎల్‌పీ నంబరు-121/1981లో ప్రజల అవసరాలు, పార్కు కోసం 1.01 ఎకరాలు ఖాళీ స్థలం (ఓపన్ సైట్) వదిలారు. పార్కు చుట్టూర ప్రహరీ కట్టకపోవడంతో కొందరు అక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదుగురు వ్యక్తులకు కల్లూరు తహశీల్దారు ఇంటి పట్టాలు ఇచ్చారని అంటున్నారు. పార్కు స్థలంలో ఇంటి పట్టాలు ఎలా ఇస్తారు..? అవి ఒరిజినల్ పట్టాలా.. బోగస్ పట్టాలా..? అధికారులు తేల్చాలి. సర్వే 304/1లో ఉన్న పార్కును చుట్టూ రక్షణ గోడలు నిర్మించి కబ్జా కాకుండా రక్షించాలి.

- యు. మాదన్న, టీడీపీ క్లస్టర్-10 ఇన్‌చార్జి, గీతా నగర్, కల్లూరు

● అవి బోగస్ పట్టాలు

గురురాఘవేంద్ర పార్కు స్థలంలో 2013లో ఐదుగురు వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలు ఒరిజనలా.. కాదా..? నివేదిక ఇవ్వమని కర్నూలు నగరపాలక అధికారులు లేఖ రాశారు. వారి లేఖలో చూపిన వివరాల ప్రకారం రెవిన్యూ రికార్డులు పరిశీలిస్తే అవి బోగస్ పట్టాలని తేలింది. వాటికి సంబంధించి మా కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేవు. ఇదే విషయం కార్పొరేషన్ అధికారులకు పూర్తి వివరాలతో లేఖ రాశాం.

- ఆంజనేయులు, తహసీల్దారు, కల్లూరు

● పార్కు స్థలం రక్షణ చర్యలు తీసుకుంటాం

గురు రాఘవేంద్ర నగర్ ఎల్‌పీ121/1981లో పార్కు స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. లే-అవుట్ పార్కు స్థలాల్లో ఇంటి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనలు ఒప్పుకోవు. ఎవరైనా కబ్జాకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే పార్కు స్థలం సరిహద్దులు గుర్తించి ప్రహరి గోడ నిర్మించడమే కాకుండా అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- పి. విశ్వానాథ్, కమిషనర్, కర్నూలు కార్పోరేషన్

గోనెగండ్లలో డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో బాలుడికి డెంగీ సోకింది. దాంతో బుధవారం పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది కాలనీకి వెళ్లి దోమలు, ఈగలు ప్రబలకుండా మందును పిచికారి చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి చెందిన బాలుడికి రెండురోజుల నుంచి జ్వరం రావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యపరీక్ష నిర్వహిస్తే డెంగీ సోకినట్లు తెలిందన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో పలువురికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.